క్లుప్తంగా

నేటి నుంచి క్షేత్రస్థాయి తనిఖీలు

లింగాల: మండలంలోని ఆయా గ్రామపంచాయతీల్లో నిర్వహించిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీలు నిర్వహించేందుకు తనిఖీ బృందం మండలానికి చేరుకుంది. శుక్రవారం నుంచి తనిఖీ బృందం గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో పనులను పరిశీలిస్తారని ఎంపీడీఓ గీతాంజలి గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

పట్టాల పంపిణీ

కల్వకుర్తి రూరల్: కాంగ్రెస్ పార్టీ చేసిన పోరాట ఫలితమే పోడు భూములకు పట్టాల పంపిణీ చేపట్టారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ 2014 -18 ఎన్నికల సందర్భంగా పోడు రైతులకు పట్టాలిస్తామని హామీ ఇచ్చి పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పోడు రైతులకు అండగా చేసిన పోరాట ఫలితంగా ప్రస్తుతం పట్టాలు పంపిణీ చేశారని అన్నారు.

పుస్తకావిష్కరణ సభ విజయవంతం చేయండి

చారకొండ: పాలమూరు అధ్యాయన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 8న అచ్చంపేట పట్టణంలో సత్యలక్ష్మి పంక్షన్‌హాల్‌లో ఉదయం 10 గంటలకు రఘుపతి రావు రచించిన 'కాలం మరువని యోధులు' పుస్తకావిష్కరణకు నియోజకవర్గంలోని ప్రజలు, పుస్తక ప్రియులు హాజరై విజయవంతం చేయాలని పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ వెంకట్ గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

కార్యవర్గం ఎన్నిక

అచ్చంపేట రూరల్: అచ్చంపేట ఎలక్ట్రానిక్ మీడియా కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మీసాల సుధాకర్, ఉపాధ్యక్షులుగా వెంకటేష్, తాహేర్, ప్రధాన కార్యదర్శిగా రవీందర్‌గౌడ్, సహాయ కార్యదర్శిగా శ్రీనివాసులు, కోశాధికారిగా రాఘవేందర్, ప్రచార కార్యదర్శులుగా సాధిఖ్, రవి, గౌరవ సలహాదారులుగా బాలకృష్ణ, భాస్కర్, గౌరవ అధ్యక్షులుగా రాములు, జాహంగీర్, రాములు, సభ్యులుగా పవన్‌కుమార్, మన్నాన్‌ను ఎన్నుకున్నారు.

ఉచిత కరెంటు ఇవ్వాలి

మన్ననూర్: గ్రామీణ ప్రాంతాల్లో కుల వృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారికి ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించి ఆదుకోవాలని బొడ్డుపల్లి చరణ్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విశ్వకర్మలు, వడ్రంగులు, కుమ్మరి, కమ్మరి, కంచరి, శిల్పి, కంసాలిలతో పాటూ వెల్డింగ్, ఇంజినీరింగ్ వర్క్ చేసుకునే కుల వృత్తుల వారు గ్రామాల్లో ఉండే అంతంత మాత్రం పనులతో కరెంటు బిల్లులు చెల్లించుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు.

జగ్జీవన్ రామ్‌కు నివాళి

కొల్లాపూర్: మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమం గురువారం బహుజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి బహుజన ఐక్యవేదిక జిల్లా నియోజకవర్గ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసులుతో పాటు పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు రాములు యాదవ్, పసుల కుమార్, వేణుగోపాల్, నాగరాజు తదితరులున్నారు.

సామర్థ్యాల పెంపుపై ప్రత్యేక శ్రద్ధ

తాడూరు: విద్యార్థుల సామర్థ్యాలపై హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఎంఈఓ భాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బలాన్‌పల్లి పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఎఫ్ఎల్ఎన్ శిక్షణకు సంబంధించిన వివరాలు విద్యార్థులకు పాఠశాలలో అమలు చేయాలన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను పరిశీలించి తరగతి గదిలో విద్యా బోధనపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

బిజినేపల్లి: పార్టీ కోసం పని చేసి తన వెన్నంటి ఉన్న ప్రతి కార్యకర్తకు చివరి శ్వాస వరకు అండగా ఉంటానని మాజీ మంత్రి, కాంగ్రెస్‌పార్టీ నాయకుడు నాగం జనార్దన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో పార్టీ సీనియర్ నాయకులు కత్తె నాగన్న, వీరారెడ్డి అనారోగ్యంతో బాధ పడుతుండగా వారిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

పోస్టర్లు విడుదల

కొల్లాపూర్: హైదరాబాద్‌లో ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్న ఏఐవైఎఫ్ జాతీయ స్థాయి వర్క్‌షాప్ పోస్టర్లను గురువారం కొల్లాపూర్‌లో సీపీఐ ప్రజాసంఘాల నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నిరుద్యోగులకు జీవనభృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. యూసూఫ్, ఆర్.ఇందిర, సీపీఐ తుమ్మల శివుడు, తదితరులున్నారు.

ఈటలకు సన్మానం

వెల్దండ: మండలానికి చెందిన బీజేపీ నాయకలు గురువారం హైదరాబాద్‌లో మాజీ మంత్రి, బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. బీజేపీ ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా ఈటలను నియమించడంతో వారు ఆయన్ను సన్మానించినట్లు తెలియజేశారు. శేఖర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, జంగయ్యయాదవ్ ఉన్నారు.


వెల్దండలో కార్మికులకు మద్దతు తెలిపి మాట్లాడుతున్న ఆంజనేయులు


కల్వకుర్తిలో మాట్లాడుతున్న పాండుగౌడ్


పెద్దకొత్తపల్లిలో మాట్లాడుతున్న దశరథం

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నాగర్‌కర్నూల్, అచ్చంటపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ నియోజకవర్గాల్లోని గ్రామపంచాయతీల్లో పనిచేసే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పాండుగౌడ్, వివధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో పంచాయతీ కార్మికులు సమ్మెకు దిగారు. వీరికి వివిధ సంఘాల నాయకులు వీరికి మద్దతు తెలిపారు.

– 'సాక్షి' నెట్‌వర్క్


తాడూరు: ఎంపీడీఓ కార్యాలయం ఎదుట


పెంట్లవెల్లి సమ్మెలో పాల్గొన్న కార్మికులు


కోడేరులో మాట్లాడుతున్న శ్రీనివాసులు


అచ్చంపేటలో


తెలకపల్లిలో మాట్లాడుతున్న తుమ్మ మహేష్


బిజినేపల్లిలో..


ఉప్పునుంతల ఎంపీడీఓ కార్యాలయం ఎదుట


లింగాలలో...

వరిని డ్రమ్ సీడర్‌తో విత్తుకోవాలి

బిజినేపల్లి: వరిలో నాటుకు బదులు డ్రమ్ సీడర్‌తో విత్తుకోవడంతో పెట్టుబడి ఖర్చు తగ్గడంతో పాటు సులువుగా విత్తుకోచ్చని పాలెం వ్యవసాయ కళాశాల దత్తత గ్రామ కన్వీనర్ డా.శశిభూషన్ రైతులకు సూచించారు. గురువారం మండలంలోని గంగారంలో డ్రమ్ సీడర్‌తో వరి ధాన్యం విత్తుకునే విధానం, ఆ గ్రామంలో రైతులు సాగు చేసిన ఆయా పంటల సస్యరక్షణ చర్యలను, పత్తిలో విత్తన శుద్ధి జీవశిలీంద్రంతో చేసుకుని నాటిన పత్తి పంటను సందర్శించారు. ఈ సందర్భంగా రైతులకు ఆయా పంటల సస్యరక్షణ చర్యలు, చీడ పీడీల నివారణ చర్యలు, సాగు పద్ధతులను రైతులకు వివరించారు.


పత్తిని పరిశీలిస్తున్న పాలెం వ్యవసాయ కళాశాల అధ్యాపక బృందం

కళాశాల అధ్యాపకులు చరణ్‌తేజ్, శ్రీనివాస్‌రెడ్డి, సుమలత, భానుశ్రీ, ఫరీద్ పాల్గొన్నారు.

చైల్డ్ హెల్ప్‌లైన్ పోస్టుల భర్తీలో అవకతవకలపై ఫిర్యాదు


డీడబ్ల్యూఓకు వినతి అందజేస్తున్న బీఎస్పీ నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 పోస్టుల భర్తీలో అవకతవకలు జరిగాయని, విచారణ జరిపి న్యాయం చేయాలని బహుజన సమాజ్‌పార్టీ ఆధ్వర్యంలో గురువారం డీడబ్ల్యూఓకు వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజ్ మాట్లాడారు. చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 పోస్టుల భర్తీలో పూర్తి అవకతవకలు జరిగాయని ఆరోపించారు. విద్యార్హత, కంప్యూటర్ స్కిల్స్, స్థానికత, అనుభవం, ఇంటర్వ్యూ లాంటివి గతంలో పనిచేసిన అనుభవం, రోస్టర్ ఆధారంగా ఇవ్వాల్సిన ఉద్యోగాలను అధికార పార్టీ కనుసన్నల్లో ఉండే వారికి ఉద్యోగాలు ఇచ్చారని ఆరోపించారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజ్, కళ్యాణ్, ఉద్యోగ అభ్యర్థులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ

తాడూరు: మండలంలోని బలాన్‌పల్లి, ఐతోల్‌లో ఫర్టిలైజర్ దుకాణాలను ఏఓ సాయిరమేశ్ కుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి రైతుకు నాణ్యమైన విత్తనాలు, రసాయన మందులు అందజేయడంతో పాటు బిల్లులు తప్పనిసరి ఇవ్వాలని దుకాణ యజమానులకు సూచించారు.


బిజినేపల్లి వ్యవసాయ దుకాణంలో శాంపిల్స్ సేకరిస్తున్న ఏఓ నీతి

బిజినేపల్లి: మండలంలోని వ్యవసాయ దుకాణంలో ఆయా విత్తనాల, పురుగు మందుల, ఎరువులకు సంబంధించి ధరల పట్టికను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఏఓ నీతి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని పలు వ్యవసాయ దుకాణాల్లో తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా విత్తనాలు, ఎరువులు, ఏయే ధరలకు విక్రయించారో పరిశీలించారు.

విద్యుత్ ఏఈపై సభ్యుల ఆగ్రహం


విద్యుత్ ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సభ్యులు

పెద్దకొత్తపల్లి: గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు విద్యుత్ ఏఈకి ఫోన్ చేస్తే ఏఈ ఫోన్ ఎత్తడం లేదని మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో వెన్నచర్ల సర్పంచ్ రాధ, ఎంపీటీసీ రవికుమార్ విద్యుత్ ఏఈ ఎన్నిమార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయడం లేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ మాట్లాడుతూ.. విద్యుత్ ఏఈ రాజేందర్‌గౌడ్ ప్రజాప్రతినిధుల ఫోన్లు ఎత్తకపోవడంతో గ్రామాల్లోని సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని అన్నారు. అనంతరం వ్యవసాయ శాఖ ఏఓ రమేశ్ మాట్లాడుతూ.. రైతులకు వానాకాలంలో కావాల్సిన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని సూచించారు. ఎంఈఓ చంద్రుడు మాట్లాడుతూ.. ఆరు గ్రామాల్లోని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం విద్యార్థులకు పెట్టడం లేదన్నారు. ఆయా వంట ఏజెన్సీలతో మాట్లాడి పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందేలా చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ దీపికాలక్ష్మణ్‌రావు, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ కృష్ణయ్య పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ

అమ్రాబాద్: మండలంలోని అమ్రాబాద్, మన్ననూర్ ప్రధాన రహదారిపై కొత్తపల్లి స్టేజీ వద్ద కల్వర్టు నిర్మాణానికి ప్రభుత్వ విప్ గువ్వలబాలరాజు గురువారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కల్వర్టు లేకపోవడంతో అధిక వర్షాల సమయంలో ఈ ప్రదేశంలో రోడ్డుపై వాగుపొర్లి ప్రయాణికులు, వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారని, కల్వర్టు నిర్మాణంతో సమస్య పరిష్కారం అవుతుందన్నారు. సర్పంచ్ శారద, చెన్నకేశవులు, రవీందర్‌రెడ్డి, జగన్‌గౌడ్ తదితరులు ఉన్నారు.


భూమిపూజ చేస్తున్న ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే గువ్వల

ట్రాక్టర్ బోల్తా: తప్పిన ప్రమాదం

ఉప్పునుంతల: మండలంలోని జప్తీ సదగోడు, మొల్గర మధ్యలో దుంధుబీ వాగు నుంచి కొన్ని రోజులుగా ఇసుక ట్రాక్టర్లు విచ్చలవిడిగా నడుస్తున్నాయి. ఈ క్రమంలోనే గురువారం ఇసుక తీసుకరావడానికి వాగుకు వెళ్తున్న ట్రాక్టర్ డ్రైవర్ అజాగ్రత్తతో ఉప్పునుంతల సమీపంలో బోల్తాపడింది. డ్రైవర్ పక్కకు దూకడంతో ప్రమాదం తృటిలో తప్పిపోయింది. వేగంగా వెళ్తున్న ట్రాక్టర్లతో ద్విచక్ర వాహనదారులు, రోడ్డు వెంట వెళ్లడానికి రైతులు భయపడుతున్నారు.

దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదు

వెల్దండ: మండల పరిధిలోని చెర్కూర్‌కి చెందిన ద్యాప సంజీవరెడ్డిపై చౌదర్‌పల్లికి చెందిన శేఖర్‌రెడ్డి దాడి చేయడంతో మృతిచెందాడు. గురువారం మృతుని అన్న లక్ష్మారెడ్డి ఫిర్యాదు మేరకు శేఖర్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలియజేశారు. మృతదేహాన్ని కల్వకుర్తి ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

కోడేరు: మండలంలోని నాగులపల్లి తండా, నార్యనాయక్ తండాలో ఎక్సైజ్ అధికారులు ఏడుకొండలు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి 20 లీటర్ల సారా, 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మండలంలో ఎవరైనా సారా అమ్మినా, కాసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇన్సూరెన్స్ కార్డుల అందజేత

కోడేరు: మండలంలోని నాగులపల్లిలో కాంగ్రెస్ పార్టీ మండల యూత్ వైస్ ప్రసిడెంట్ వీరపాగ చెన్నకేశవులు ఆధ్వర్యంలో రూ.2 లక్షల ప్రమాద బీమా ఇన్సూరెన్స్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసి రాబోయే రోజుల్లో కొల్లాపూర్ కోటపై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదలకు సంక్షేమ పథకాలు అందాయని అన్నారు.

ఇళ్ల స్థలాలకు దరఖాస్తులు

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో కొద్ది రోజులుగా నిరుపేదలు ప్రభుత్వ స్థలం 22, 27లోని 14 ఎకరాల 36 గుంటల భూమిలో ఆందోళన చేస్తూ గుడిసెలు వేసుకున్నారు. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేయగా.. ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఆదేశాలు వచ్చాయని ఆర్డీఓ హనుమానాయక్ తెలియజేశారు. ఈ నెల 10వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, ఒక్కొక్కరికి 75 గజాల చొప్పున 420 ప్లాట్లు పంపిణీ చేస్తామని చెప్పారు. ఇల్లు లేని వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రామపంచాయతీ వాసులై ఉండాలని, వారి ఆధార్‌కార్డు, పాస్‌కార్డు, రేషన్‌కార్డులను దరఖాస్తుకు జతచేయాలని వివరించారు.

మొక్కలు నాటాలి

చారకొండ: గ్రామాల్లో ఖాళీ స్థలాల్లో, రోడ్డుకు ఇరువైపుల మొక్కలు నాటి వాటి సంరక్షణ చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ జయసుధ సూచించారు. మండలంలోని గోకారం, శాంతిగూడెం, తుర్కలపల్లి, చారకొండ, సిర్సనగండ్ల గ్రామాల్లో గురువారం ఎంపీడీఓ జయసుధ హరితహారంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని పరిశీలించారు.

చెక్కు పంపిణీ

ఉప్పునుంతల: పెద్దాపూర్‌లో గురువారం గ్రామానికి చెందిన గోవిందు లక్ష్మమ్మ, బండ్ల మాధవికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను సర్పంచు శిరీష, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొత్త రవీందర్‌రావు చేతులమీదుగా అందజేశారు.

రైతువేదికకు తాళం వేసిన కాంట్రాక్టర్

చారకొండ: మండలంలోని గోకారం రైతువేదికకు బిల్లురాక, అధికారులు స్పందించక రైతువేదికను నిర్మించిన కాంట్రాక్టర్ భాస్కర్‌రెడ్డి, సైదులు, సరిత గురువారం రైతువేదికకు తాళం వేశారు. దాంతో అధికారులకు, రైతులు కార్యాలయంలోకి రాకుండా అవాంతరాలు ఏర్పడ్డాయి. కాంట్రాక్టర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రైతువేదిక నిర్మాణానికి రూ.22 లక్షలు మంజూరు అవ్వగా.. నిర్మాణం త్వరగా పూర్తిచేయాలని అధికారులు ఆదేశాలు ఇవ్వడంతో పనులు పూర్తి చేశాం. పనులు పూర్తయి రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటి వరకు నాలుగు విడతలుగా రూ.12 లక్షలు విడుదలయ్యాయి. మిగతా బిల్లు కోసం సంబంధిత అధికారులు ఏఈ నుంచి ఎస్‌ఈ వరకు అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని తెలియజేశారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని బిల్లు చెల్లించకుంటే ఆదోళన చేపడుతామని పేర్కొన్నారు.


గోకారంలో రైతువేదికకు తాళం వేస్తున్న కాంట్రాక్టర్

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి


క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించిన యూత్ కాంగ్రెస్ నాయకులు

కల్వకుర్తి టౌన్: ప్రభుత్వం రైతుల అకౌంట్లలో జమచేసిన రైతుబంధు డబ్బులను బ్యాంకర్లు హోల్డ్‌లో ఉంచటం దారుణమని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అనిల్ అన్నారు. గురువారం అకౌంట్లను హోల్డ్‌లో ఉంచటాన్ని నిరసిస్తూ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని కార్యకర్తలతో కలిసి ముట్టడించారు. రైతులకు పెట్టుబడులకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు విడుదల చేసిన డబ్బును హోల్డ్‌లో ఉంచటం సరికాదని అన్నారు. నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాలరాజు, జంగయ్య, రాజు, నర్సింగ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మానువడ్డ వాగుపై బ్రిడ్జి నిర్మిస్తాం

మన్ననూర్: కొన్ని దశాబ్దాల కాలంగా రాజకీయ హామీగానే మిగిలిపోయిన మానువడ్డవాగుపై బ్రిడ్జి నిర్మాణం చేసి పదర, అమ్రాబాద్ మండలానికి (అప్పర్‌ప్లాట్) తాగునీరు, సాగునీరు అందించేందుకు కృషిచేస్తామని అచ్చంపేట నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ సతీష్ మాదిగ అన్నారు. గురువారం అమ్రాబాద్ మండలం లక్ష్మాపూర్ సమీపంలోని మానువడ్డ వాగు ప్రాంతాన్ని బీజేపీ జాతీయ నాయకుడు మంగ్యానాయక్‌తో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్, టీడీపీ, బీఆర్ఎస్ నాయకులు మానువడ్డ వాగు పేరుతో తరుచుగా వాగ్దానాలు చేస్తూ అధికారం చేజిక్కించుకుంటూ మళ్లీ ఆ మాటకూడ ఎత్తకపోగా మళ్లి చూడటం లేదని విమర్శించారు. మద్దిమడుగు ఆంజనేయ స్వామి, మారెమ్మ తల్లి, చెన్నకేశవ స్వామి, ఉమామహేశ్వర స్వామి ఆశిస్సులు, తెలంగాణ ప్రజల దీవెనలతో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని అన్నారు. పదర మండల అధ్యక్షుడు కొయ్యల మల్లేష్, హన్మంతు, చంద్రయ్య, రాముయాదవ్, దేవేందర్‌రెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.


మారెమ్మగుడి వద్ద గ్రామస్తులతో మాట్లాడుతున్న సతీష్ మాదిగ

సహకారాన్ని వినియోగించుకోవాలి

తెలకపల్లి: ప్రభుత్వం అందజేస్తున్న సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కొమ్ము మధు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఐకేపీ భవనం వద్ద మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో కస్టమర్ హైరింగ్ సెంటర్ సీహెచ్ ట్రాక్టర్ సాయంతో వ్యవసాయ పరికరాలకు, భూమిని దున్నడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలని వినతి

వెల్దండ: విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతగా అందించాలని కోరుతు ఏబీవీపీ శాఖ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ రవికుమార్‌కు వినతి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండల కేంద్రంలోని మోడల్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించడం లేదన్నారు. దీంతో విద్యార్థులు అర్ధాకలితో ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. అనంతరం వినతి అందజేశారు. ఉమేష్, చరణ్ ఉన్నారు.

అవకతవకలు నివారించాలి

చారకొండ: గొర్రెల పంపిణీలో కొనసాగుతున్న అవకతవకలను ఉన్నత అధికారులు, ప్రజాప్రతినిధులు వాటిపై ప్రత్యేక చొరవ తీసుకుని వాటిని నివారించాలని ఉమ్మడి జిల్లా గొర్రెల, మేకల సంఘం మాజీ అధ్యక్షుడు జూపల్లి వెంకటయ్య యాదవ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం కురుమ, యాదవులకు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టి అమలు చేస్తున్న గొర్రెల పంపిణీలో గతంలో చాలా అవకతవకలు జరిగాయని, వాటిని సంబంధిత ఆధారాలు ఉన్నాయని అన్నారు.

భూమిపూజ

కల్వకుర్తిరూరల్: ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ సహకారంతో మండలంలోని మార్చాలలో నిరుపేదలైన పెంటయ్య, లక్ష్మయ్య, కృష్ణయ్య, సుల్తాన్, నిరంజన్‌లకు చెందిన స్థలాల్లో ఇంటి నిర్మాణాలను సర్పంచ్ సునీతా వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ సంతోషా గురువారం ప్రారంభించారు.

'ఎమ్మెల్యేపై పరువునష్టం దావా'

కొల్లాపూర్: కొల్లాపూర్ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డిపై మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు పరువునష్టం దావా వేసినట్లు జూపల్లి అనుచరులు వెల్లడించారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. హర్షవర్ధన్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి జూపల్లి కృష్ణారావుపై తప్పుడు ప్రచారాలు చేయిస్తున్నారని ఆరోపించారు. హుస్సేన్‌సాగర్‌లో జరిగిన ప్రమాదాన్ని హత్యగా, బ్యాంకును ముంచినట్లు, దేవాదాయశాఖ భూములు ఆక్రమించుకున్నట్లు సోషల్‌మీడియా, పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాల ద్వారా ప్రచారాలు చేస్తున్నారన్నారు. దీనిని పలుమార్లు ఖండించినా వారు మారటం లేదన్నారు. అందుకే ఎమ్మెల్యేపై న్యాయపరంగా ఎదుర్కొనేందుకు జూపల్లి సిద్ధమయ్యారని వివరించారు. ఎమ్మెల్యేపై జూపల్లి కృష్ణారావు రూ.వంద కోట్లకు పరువునష్టం దావా వేసేందుకు సిద్ధమయ్యారని, ఎమ్మెల్యేకు లీగల్ నోటీసులు పంపినట్లు చెప్పారు.

వెల్దండ సీఐ బదిలీ

వెల్దండ: వెల్దండ సర్కిల్ సీఐగా విధులు నిర్వహిస్తున్న రామకృష్ణ బదిలీపై హైదరాబాద్‌లోని ఐజీ కార్యాలయంలోని మల్టీజోన్‌కు బదిలీ అయ్యారు. వెల్దండకు ఐజీ కార్యాలయం నుంచి సీఐగా సోమనర్సయ్యను నియమించారు. ఈ మేరకు ఉత్తర్వులు వెలువడ్డాయి. త్వరలోనే వెల్దండ సీఐగా సోమనర్సయ్య బాధ్యతలు స్వీకరిస్తారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని బోడబండ తండాకు చెందిన 30 మంది ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో బీఆర్ఎస్‌లో చేరారు.

పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో వరల్డ్ జునోసిస్ డే సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో పెంపుడు కుక్కలకు పశుసంవర్ధక సిబ్బంది గురువారం ఏఆర్‌బీ వ్యాక్సిన్ వేశారు. ఈ వ్యాక్సిన్ ద్వార కుక్కలకు ఎలాంటి రోగాలు వ్యాపించవని సూచించారు.

చదువుకుంటేనే భవిష్యత్

కల్వకుర్తి రూరల్: చదువుతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమని విద్యాస్వేచ్ఛ ఫౌండేషన్ చైర్మన్ వాసుదేవ్ పూర్ణచందర్‌రావు అన్నారు. గురువారం మండలంలోని తాండ్రలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఫౌండేషన్ ద్వార రూ.30 వేల విలువ చేసే నోట్‌పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్ అందజేశారు.

సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఉమామహేశ్వరి

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో గురువారం ఎంపీపీ ఉమామహేశ్వరి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో మండలంలోని ఆయా గ్రామాల్లోని పలు అంశాలపై సమావేశం కొనసాగింది. ఆయా గ్రామాల సర్పంచ్‌లు వారి గ్రామాల్లో ఉన్న సమస్యలను సమావేశంలో వినిపించుకుని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. అదే విధంగా పలు శాఖల అధికారులు కొంత కాలంగా చేసిన పనులపై, చేయబోయే పనులపై సమావేశంలో తెలియజేశారు. ముఖ్యంగా గ్రామాల్లోని విద్యుత్, నీటి సమస్య, వీధిలైట్లు, డ్రెయినేజీ వంటి సమస్యలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడారు. ప్రతి గ్రామంలో ఎలాంటి సమస్య లేకుండా అధికారులు, నాయకులు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని, ప్రతిఒక్కటి ప్రజలకు అర్థమయ్యేలా, అర్హులకు అందేలా చూడాలన్నారు. సమస్యలను దగ్గరుండి పరిష్కరించాలని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

పోడు భూముల పట్టాలు సరిచేయండి

పెంట్లవెల్లి మండలంలోని యంగంపల్లి తండాలో ప్రజలకు కొద్ది రోజుల కిందట ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పంపిణీ చేసిన పోడు భూముల పట్టాల్లో అందరికి సరైన న్యాయం జరగలేదని, 2 ఎకరాలు ఉన్న వారికి ఎకరా, ఎకరా ఉన్న వారికి అర ఎకర మరికొంత మందికి గుంటల్లోనే పట్టాలు వచ్చాయన్నారు. సర్వే నిర్వహించి తక్కువ వచ్చిన వారికి న్యాయం జరిగేలా అధికారులు కృషి చేయాలని సర్పంచ్ గోపినాయక్ సర్వసభ్య సమావేశంలో తెలియాజేశారు. ఎంపీపీ ఉమామహేశ్వరి, సింగిల్ విండో చైర్మన్ విజయరామారావు, ఎంపీడీఓ రామయ్య, మతీన్ తదితరులు పాల్గొన్నారు.